# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

APRIL - 2001

# సంక్షిప్త వార్తలు

2001 మార్చి 7వ తేదీనాడు పెద్దాపురం మండలం చదలాడలో ఒకరోజు సువార్త కూటము, బైబిలు క్లాసు జరిగెను. దానికి చుట్టుప్రక్కల నున్న గ్రామముల నుండి కూడా సోదర సోదరీలు హాజరైరి. ఉదయకాలపు క్లాసులో సోదరులు ఆర్.ప్రకాశరెడ్డి, యం.కృపానందం గార్లు వాక్యపరిచర్య చేసిరి. జాషువాగూటం గారు ముఖ్య ప్రసంగీకులుగా ఆరోజు ఆహ్వానించబడిరి. అందరికీ అర్థమయ్యేలాగున క్రీస్తును గూర్చి, ఆయన సంఘమును గూర్చి చక్కగా వివరించిరి. అలాగే మధ్యాహ్నకాలమందు కూడా జరిగెను. ఆదినం కూటం అనంతరం క్రీస్తులోనికి 14మంది బాప్తిస్మము పొందిరి. కందరాడ నుండి సోదరులు ప్రకాశరెడ్డి, రాజారెడ్డి గార్లును, మాధవపురం నుండి సోదరులు యం. యేసుదాసు గారును ఈ కూటములో పాల్గొనిరి. చదలాడలో యం.ప్రేమ్‌కుమార్ గారు సువార్తపని చేయుచున్నారు.

2001 మార్చి 15వ తేదీ గురువారం నాడు కొత్తపల్లి మండలం మాధవపురంలో యున్న క్రీస్తు సంఘము ఏర్పాటుచేసిన కూటములో సోదరులు జాషువాగారు సతీసమేతముగా హాజరైరి. వాక్యపరిచర్య చేసిరి. కూటం అనంతరం ఎనిమిదిమంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. మాధవపురంలో సోదరులు యం.యేసుదాసు గారు వాక్య పరిచర్య చేయుచున్నారు.

2001 మార్చి 21వ తేదీ బుధవారం అల్లవరం మండలం యెంట్రుకోనలో సువార్తికుల సదస్సు జరిగెను. ఉభయగోదావరి జిల్లాల నుండి వచ్చిన పలు సువార్తికులతో స్థానిక క్రీస్తు సంఘ ఆలయము దాని ప్రాంగణము నిండియుండెను. ఆనాడు, "క్రీస్తును గూర్చి ఆయన సంఘమును గూర్చి మీకు యేమితోచుచున్నదనే" అంశమును సోదరులు సవిస్తరముగా చర్చించిరి. సోదరులు జాషువాగూటం గారు కూటమునకు అధ్యక్ష్యతవహించి చక్కగా నడిపించిరి. దొగ్గా ఇశ్రాయేలు రాజు (కొండుకుదురు) గారు పాటలు నడిపించగా, సోదరులు కె.జార్జి (ఎ.వేమవరప్పాడు) గారు ప్రారంభ ప్రార్థన చేసిరి. సోదరులు జి.నేటీసెయింట్ (గొల్లవిల్లి), డి.చిరంజీవి (బండార్లంక), టి.వి.యన్.కుమార్ (కాకినాడ), కె.జార్జి, బూల యోహాను (పల్లంకుర్రు), జాషువాగూటం గార్లు

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 ఏప్రియల్ 2001 సంచిక 9


# దైవత్వము

## (The Godhead)

"దేవుని గూఢాంశములను నీవు తెలిసికొనగలవా? సర్వశక్తుడగు దేవుని గూర్చి నీకు పరిపూర్ణ జ్ఞానము కలుగునా?" యని యోబు యొక్క మిత్రుడగు జోఫరు అతని ప్రశ్నించెను (యోబు 11:7).. "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నదని" అపొ.పౌలు వ్రాసాడు (1 తిమోతి 3:16). అంతేకాదు, "ఆహా! దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము. ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు; ఆయన మార్గములు ఎంతో అగమ్యములు" అని అతడు ఆశ్చర్యాన్ని వ్యక్తపరచాడు (రోమా 11:33).

దేవుని గూర్చిన మర్మము గొప్పదై యున్నను, మనమాయనను తెలిసికొనాలని దేవుడు కోరుచున్నాడు. "అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన

యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము" అని యేసు ప్రభువు చెప్పారు (యోహాను 17:3). అంటే, నిజదేవుని మనం తెలుసుకొనాలి. ఆయన అద్వితీయ కుమారుడగు యేసుక్రీస్తును మనం తెలుసుకొనాలి. నిజదేవుని తెలుసుకొన్న వారికే నిత్యజీవం అని యేసుప్రభువు యొక్క మాటలలో ఇమిడియున్నది. దేవుడు తన్నుతాను మనకు బయలు పరచుకొన్నారు. గనుక ఆయన మాటలను విననవారు "మూఢులైనను దానిలో నడుచుచు త్రోవ తప్పక యుందురు" (యెషయా 35:8). అందువలన మనం అవివేకులము కాక ప్రభువు యొక్క చిత్తమేమిటో తెలిసికొనాలి (ఎఫెసీ 5:17).

దేవుడు అనుపదము గ్రీకుభాషలో Theos అనుపదము నుండి వచ్చినది. హెబ్రీ భాషలో అది Elohim అను పదము నుండి వచ్చినది. Elohim అనగా ఆరాధనామూర్తి (a being to be Worshipped) అని యర్థము. అయితే Elohim అనుమాట ఒకే ఒక్క దేవునికే వాడబడినను, అది బహు వచనమును సూచించును. ఆదికాండము 1:1లో "ఆదియందు దేవుడు (Elohim) భూమ్యాకాశములను సృజించెను" అని వ్రాయబడినను ఇక్కడ Elohim అను బహువచనము హెబ్రీ భాషలో వాడబడినది. దేవుడొక్కడే అయినను, Elohim (అనగా దేవుండ్లు అను భావము వచ్చు) అను బహువచనము ఎందుకు వినియోగించబడినది?

"ఆకాశమందైనను భూమి మీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి. ఆయన నుండి సమస్తమును కలిగెను" (1 కొరింథీ 8:6). దేవుడొక్కడే అయినను ఆయన త్రియేక దేవుడు. దైవత్వంలో ముగ్గురు మూర్తులున్నారు. వారందరు ఏకమైయున్నారు. ఆదికాండము మొదటి అధ్యాయము రెండో వచనములో, "దేవుని ఆత్మ జలములపై అల్లాడు చుండెను" అని యున్నది. తరువాత ఆదికాండము 1:26లో "దేవుడు - మనస్వరూపమందు, మన పోలికచొప్పున నరులను చేయుదము" అన్నప్పుడు ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతోను, పరిశుద్ధాత్మునితోను సంభాషించుచుండెనని మనం ఎరుగుదుము. దీనిని బట్టి దైవత్వంలో తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముడు (ముగ్గురు మూర్తులు) ఉన్నారని

మనం గ్రహించుకోవచ్చును. ఈ ముగ్గురు మూడు దేవుండ్లు కాదు గాని వారు త్రియేక దేవుడై యున్నారు. ఈ మర్మము మనకు గ్రాహ్యము కాకపోయినను, యిది బైబిలు బోధించు వాస్తవము.

## తండ్రియైన దేవుడు

"ఆత్మయు ఒక్కడే ... ప్రభువు ఒక్కడే ... అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే" యని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 4:4). ఈ లోకములో యుండగా యేసు ప్రభువు తాను తండ్రియైన దేవుని నని ఎన్నడు చెప్పుకోలేదు. ఆయన జననమును గూర్చి చెబుతూ నిత్యుడగు తండ్రియని ఆయనకు పేరుపెట్టబడునని యెషయా ప్రవచించాడు (యెషయా 9:6). అయితే ఆదిమ హెబ్రీభాషలో ఆయన నిత్యుడగు తండ్రియని గాక, నిత్యత్వానికి తండ్రియని యున్నది. అంటే యేసుప్రభువు నిత్యము ఉన్నవాడు. He was Father of Eternity. నిత్యము ఉన్నవాడు, నిత్యుడు ! !

ఈ లోకంలో యున్నప్పుడు యేసు తరుచు ప్రార్థించేవారు. ఆయన "తండ్రీ"యని సంబోధించుచు ప్రార్థించేవారు (యోహాను 17:1). ఆయన ప్రసంగాలలో పరలోకపు తండ్రివైపు ప్రజల మనస్సులను మళ్ళించేవారు. "పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి" (మత్తయి 5:44). "మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడు గనుక మీరును పరిపూర్ణులుగా ఉండెదరు" అని ఆయన బోధించారు (మత్తయి 5:48). ప్రజలు ప్రార్థించునప్పుడు దేవునిని "పరలోకమందున్న మా తండ్రీ" యని సంబోధించాలని ఆయన నేర్పారు (మత్తయి 6:9). బేతనియలో చనిపోయిన లాజరును సమాధిలో నుండి బ్రదికింపక ముందు, "తండ్రీ నీవు నా మనవి వినినందున నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించు చున్నాను. నీవు ఎల్లప్పుడును నా మనవి వినుచున్నావని నేనెరుగుదును" అని ఆయన ప్రార్థించారు (యోహాను 11:41-42).

యేసు తన్నుతానే తండ్రీయని సంబోధించుకొనక, తన కంటె వేరైన మూర్తిని అట్లు సంబోధించారు. ఈయనకు జీవన్మరణములపై శక్తియున్నట్లు ఆయన ఎరిగియుండెను. ఆయన తండ్రీయని ఎవరిని సంబోధించారో ఆయనకు పాపములు క్షమించే అధికారమున్నదని కూడ ఆయన ఎరుగును. ఏలయనగా తాను సిలువలో వ్రేలాడు చుండగా, "యేసు - తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని" ప్రార్థించారు (లూకా 23:34). అందువలన కుమారుడైన దేవుని నుండి, పరిశుద్ధాత్ముడైన దేవుని నుండి వేరుగా యున్న తండ్రియైన దేవుడున్నారని మనం గ్రహించుకొనవచ్చును.

## కుమారుడైన దేవుడు

"నరులను చేయుదము" అని దేవుడు పలికినప్పుడు తండ్రియైన దేవుడు కుమారుడైన దేవునితో సంభాషించుచుండెనని ఆది.కా. 1:26లో మనం గమనించాము. దేవుని యొక్క అద్భుతమైన సృష్టి అంతయు తండ్రి, కుమారుడైన యేసుద్వారా జరిగించెను. "సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్న దేదియు ఆయన లేకుండా కలుగలేదు" (యోహాను 1:2-3).

దైవత్వములోని రెండోమూర్తి పాతనిబంధన కాలములోనే పనిచేయుచున్నట్లు మనం చూడగలము. ఆయన ద్వారా సమస్తమును సృజింపబడెను. పాత నిబంధనలో "యెహోవా దూత" యని చెప్పబడే వ్యక్తి యేసే యని అనేకులు భావిస్తారు (ఆది.కా. 16:7; 22:15-16; నిర్గమ 3:2-4). ఆయన అరణ్యములో ప్రయాణించుచున్న ఇశ్రాయేలీయులతో కూడ ఉండెను. వారందరు ఆత్మ సంబంధమైన బండలోనిది త్రాగిరి. ఆ బండక్రీస్తే యని క్రొత్త నిబంధనలో చెప్పబడియున్నది (1 కొరింధీ 10:4).

ఒక విధంగా చూస్తే మానవులందరు దేవుని కుమారులే (లూకా 3:38). అట్లే దేవదూతలు కూడాను (కీర్తన 29:1; యోబు 1:6). అయితే యేసుప్రభువు ఒక్కడే దేవుని ఏకైక కుమారుడు (యోహాను 1:18; కీర్తన 2:9). భౌతికంగా ఆయన కన్యయైన

మరియ గర్భంలో పరిశుద్ధాత్మని ద్వారా జన్మించెను (లూకా 1:35). అయితే ఆయన ఉనికి మరియకు జన్మించడం ద్వారా ఆరంభము కాలేదు. ఆయన ఆదినుండి యుండెను. ఆయనే ఆదియై యుండెను. "నేనే అల్ఫాయు, ఓమెగయు, మొదటి వాడను, కడపటి వాడను, ఆదియు అంతమునై యున్నానని" ఆయన సెలవిచ్చెను (ప్రకటన 22:13). ఆయన మానవుల కంటె, దేవదూతల కంటె ఉన్నతుడు. ఆయన దేవుడు. తండ్రియైన దేవునితోను, పరిశుద్ధాత్ముడైన దేవునితోను సమానుడు.

## పరిశుద్ధాత్ముడైన దేవుడు

సృష్టిలో తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు మాత్రమే గాక, పరిశుద్ధాత్మ దేవుడు కూడా పాల్గొనినట్లు మనం చూడగలము. దేవుని ఆత్మ చీకటి అగాధ జలములపైన కమ్మియుండెనని ఆది.కా. 1:2 చెప్పుచున్నది. పరిశుద్ధాత్ముడు ఇశ్రాయేలీయుల మధ్య నివసించెను. న్యాయాధిపతులను, ప్రవక్తలను ఆయన నడిపించెను (2 సమా 23:2). అయినను ఇశ్రాయేలీయులు తిరుగుబాటు చేసి ఆయన పరిశుద్ధాత్మను దుఃఖింపజేసిరి (యెషయా 63:10).

యేసుప్రభువు బాప్తిస్మము పొందినప్పుడు పరిశుద్ధాత్మ పావురము వలె ఆయన మీదికి దిగెను (మత్తయి 3:16). పరిశుద్ధాత్మ ఆయనకు కొలత లేకుండా అనుగ్రహించబడెను (యోహాను 3:34). పరిశుద్ధాత్మునికి సమస్తమును తెలియును (1 కొరింథీ 2:11). ఆయన వినును, మాట్లాడును, మన పక్షమున విజ్ఞాపనము చేయును (యోహాను 16:13; రోమా 8:26). ఆయన నిత్యుడు (హెబ్రీ 9:14). ఆయనతో అబద్ధమాడితే దేవునితో అబద్ధమాడినట్లే (అపొ.కా. 5:3-4). ఏలయనగా ఆయన దేవుడు. అందువలన మారుమనస్సు పొందిన విశ్వాసి తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపింపబడినది (మత్తయి 28:18-20).

దైవత్వములోని ముగ్గురు మూర్తులు సమానులు. తండ్రియైన దేవుడు సమస్తాధికారము కుమారునికి అప్పగించియున్నాడు. ఆయన చిత్తము పరిశుద్ధాత్మ

ప్రేరణ వలన లిఖించబడిన క్రొత్త నిబంధన ద్వారా ప్రజలకు తెలియజేయబడుచున్నది. తీర్పునాడు ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును; అప్పుడు అంతము వచ్చును (1 కొరింధీ 15:24).

బైబిలు బయలుపరచు నిజదేవుని తెలిసికొనుట అత్యవసరం. మనం నిత్యజీవంలో ప్రవేశించాలంటే తండ్రియైన దేవుని గూర్చి, కుమారుడైన యేసు క్రీస్తును గూర్చి తెలిసికొనాలి. యేసు ప్రభువు నందు విశ్వాసముంచి, ఆయన చెప్పినట్లు చేయుట ద్వారా దేవుని చిత్తమును తెలిసికొనగలము.

000

# దహించు అగ్ని
## (A consuming Fire)

దేవుడు ప్రేమయై యున్నాడని మనం తలస్తాము (1 యోహాను 4:8). దేవుడు వెలుగైయున్నాడు (1 యోహాను 1:5). దేవుడు ఆత్మయై యున్నాడు కూడా (యోహాను 4:24). అయితే దేవుడు దహించు అగ్నియై యున్నాడని చాలమందికి తెలియదు. హెబ్రీ 12:28-29లో ఇట్లు వ్రాయబడి యున్నది: "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది, దైవ కృప కలిగియుందము. ఆ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదుము, ఏలయనగా మనదేవుడు దహించు అగ్నియై యున్నాడు". అగ్నియై యున్న దేవుని మనము సేవించుచున్నాము!.

మొదటిగా, మనదేవుడు మండుచున్న పొద దేవుడు. హోరేబు కొండ దగ్గరకు మోషే వచ్చినప్పుడు, "ఒక పొద నడిమిని అగ్ని జ్వాలలలో యెహోవా దూత అతనికి ప్రత్యక్షమాయెను. అతడు చూచినప్పుడు అగ్నివలన ఆ పొద మండుచుండెను. గాని పొద కాలిపోలేదు" (నిర్గమ 3:2). దేవుడు ఆ పొదనుండి మోషేను పిలిచెను.

అతడు నిలిచియున్న ప్రదేశము పరిశుద్ధమైనది గనుక అతడు తన చెప్పులను విడువవలెనని దేవుడతనికి చెప్పెను. మరియు తానెవరో దేవుడు మోషేకు తెలియజేసెను. మోషే తన ముఖమును కప్పుకుని దేవునివైపు చూడవెరచెను. ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించి తీసికొనిపోవలెనని దేవుడు మోషేకు తెలియజేసెను (నిర్గమ 3:3-10).

"యెహోవా అగ్నితో సీనాయి పర్వతము మీదికి దిగి వచ్చినందున అదంతయు ధూమమయమై యుండెను" అని నిర్గమ 19:18లో వ్రాయబడి యున్నది. ఈ రీతిగ అగ్నియైన దేవుని మోషే రెండు మారులు ఎదుర్కొనవలసి వచ్చెను. సీనాయి పర్వతము మీద అగ్నియైన పరలోక దేవుడు మోషేకు పది యాజ్ఞల నిచ్చెను.

మన దేవుడు ఇప్పటికిని దహించు అగ్నియై యున్నాడు. దేవుడు మార్పులేని వాడు (మలాకీ 3:6). నేడాయన మండుచున్న పొందలో నుండి మనకు కనబడబోవుట లేదు. గాని ఆయన చిత్తమును బయలు పర్చుటకును, మనం ఆయన తట్టుచూడగల్గునట్లును అగ్నిని ఆయన ఇంకను వినియోగించుచున్నాడు. యిర్మియా 23:29లో దేవుని వాక్యము అగ్నివంటిది కాదా? యని చెప్పబడింది. దేవుని వాక్యము తన హృదయములో మండుచున్న అగ్నివలె యున్నదని యిర్మియా చెప్పెను. (యిర్మియా 20:9).

రెండవదిగా, మనదేవుడు అగ్ని గంధకముల దేవుడు. సొదొమ గొమొఱ్ఱాలపై ఆయన గంధకమును అగ్నిని కురిపించెను. ఈ దుర్మార్గ పట్టణములు, దాని నివాసులు బొత్తిగా నాశనరి చేయబడిరి. (ఆది.కా. 19:24; లూకా 17:29). "సొదొమ గొమొఱ్ఱాలును వాటి చుట్టు పట్లనున్న పట్టణములును వీరివలెనే వ్యభిచారము చేయుచు, పరశరీరానుసారులైనందున నిత్యాగ్ని దండన అనుభవించుచు దృష్టాంతముగ ఉంచబడెను" అని యూదా:9లో వ్రాయబడియున్నది. దీనిని బట్టి నైతిక దుష్టత్వమును గూర్చిన దేవుని తత్వమేమిటో మనం గ్రహించుకొనగలము. పురుషసంయోగులు, తమ స్వాభావికతత్వమును వీడిన స్త్రీలు కూడ తమవలె

జీవించువారికి కలుగబోవు అంతమును గూర్చి జాగ్రత్త పడవలెను. దేవుడు ఇవ్విధమైన పాపములను ఎన్నడు సహించలేదు, సహించబోడు కూడ! మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు!

మూడవదిగా, మనదేవుడు అగ్నితో జవాబిచ్చును. 1 రాజుల గ్రంథము 18వ అధ్యాయములో ప్రవక్తయైన ఏలియాకును, అహాబు రాజుకును మధ్య జరిగిన ఘర్షణను గూర్చి చదువగలము. దీనిని "దేవుండ్ల యుద్ధమని" కూడ కొందరంటారు. తమ దేవుడే నిజమైన దేవుడని నిరూపించుడని బయలు ప్రవక్తలను ఏలియా సవాలు చేసాడు. తామర్పించిన బలిని దహించుటకు పైనుండి అబద్ధ దేవుండ్లు అగ్నిని పంపలేకపోయారు. తానే సజీవుడైన నిజమైన దేవుడనని యెహోవా నిరూపించెను. అగ్ని ద్వారా జవాబిచ్చు దేవుడాయన (1 రాజులు 18:24). ఏలియా ప్రార్థన చేయుచుండగా, "యెహోవా అగ్నిదిగి, దహన బలిపశువును కట్టెలను రాళ్లను బుగ్గిని దహించి కందకమందున్న నీళ్లను ఆరిపో జేసెను" (1 రాజులు 18:38). విగ్రహారాధన వ్యర్థమని చెప్పుటకు ఆయన అగ్నిని వినియోగించెను.

దేవుడు లేడని చెప్పేవారు నేడు కూడ వున్నారు. బైబిలు సూచించు దేవుడు సజీవుడైన నిజదేవుడు కాదని చెప్పేవారు కూడా వున్నారు. ఈ లోకం అంతమయ్యేటప్పుడు ఆయన వున్నాడనియు, ఆయనే నిజమైన దేవుడనియు అగ్నిద్వారా ఆయన ప్రజలకు తెలియజేయును. 2 పేతురు 3:10 యిట్లు చెప్పుచున్నది: "అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమై పోవును. భూమియు దాని మీదనున్న కృత్యములును కాలిపోవును". మనదేవుడు దహించు అగ్నియై యున్నాడు. యుగాంతమందు ఈ దుష్టలోకమును అగ్నిలో ఆయన దహించివేయును.

చివరిగా, మనదేవుడు అంతులేని నిత్యాగ్నియై యున్నాడు. నరకాన్ని గూర్చి చెబుతు అది "అగ్ని ఆరని ప్రదేశమని" యేసు చెప్పెను (మార్కు 9:43-46, 48).

అది నిత్యాగ్ని యని మత్తయి 25:41 చెప్పుచున్నది. అది నిత్యాగ్ని దండన యని యూదా:7లో చెప్పబడినది. నరకము అగ్నిగంధకములతో మండుగుండమని, శిక్షింపబడినవారు దానిలో యుగ యుగములు రాత్రింబగళ్లు బాధింపబడుదురని ప్రకటన 20:10లో చెప్పబడినది. క్రీస్తు దానిని నిత్యశిక్షయని పలికెను. (మత్తయి 25.46). అపొ.పౌలు యిట్లు చెప్పెను: "ప్రభువైన యేసు తన ప్రభావమును కనుబరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్ము‌ను శ్రమపరచువారికి శ్రమయు, శ్రమ పొందుచున్న మీకు మాతో కూడ విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే" (2 థెస్స 1:6-9). మన దేవుడు నిజంగా దహించు అగ్నియై యున్నాడు!

మనదేవుడు దహించు అగ్నియై యున్నాడు గనుక మనము వినయ భయభక్తులతో ఆయనను సేవించవలెను. అగ్నియైయున్న దేవుడు క్రైస్తవుడు కూడా ఆయనకొరకు అగ్నివలె మండుచు యుండాలని కోరుచున్నాడు! లవొదికయలో యున్న సంఘము వెచ్చగా యుండాలని ఆయన వారికి చెప్పెను. వారు ఆసక్తి కలిగి ఆత్మలను సంపాదించాలని ఆయన కోరాడు (ప్రకటన 3:15, 19) మనమాయన కొరకు ఆసక్తి కలిగియుండకపోతే మారుమనస్సు పొందాలి, లేదా నశించిపోతాము (లూకా 13:3). మిత్రుడా, నీవు క్రైస్తవుడవు కాకపోతే యేసుప్రభువు నందు విశ్వాసముంచి, మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందాలి (యోహాను 8:24; లూకా 13:3; మార్కు 16:16). తరువాత దేవుని కొరకు ఉద్రేకము కలిగియుండాలి. క్రైస్తవులు, క్రైస్తవులు కానివారు కూడా దేవుని కొరకు ఉద్రేకము లేనివారైతే వారు నిత్య నరకాగ్నిలో పడవేయబడుదురు! !

000

# "క్రీస్తు మరల వచ్చునప్పుడు ..."
# (When Christ comes again)

బైబిలు బోధించు దాని నంతటి సారాంశమును మనము మూడు మాటలలో క్లుప్తముగ చెప్పుకొనవచ్చును. క్రీస్తు రాబోవు చున్నాడు, క్రీస్తు వచ్చెను, క్రీస్తు మరల రాబోవు చున్నాడు. క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి క్రొత్త నిబంధన యంతటిలోను గొప్ప ప్రాముఖ్యత ఈయబడి యుండుట మనము చూడగలము. క్రీస్తు ఇదిగో ఇప్పుడు వచ్చుచున్నాడు, అదిగో అప్పుడు వచ్చుచున్నాడని జోస్యము చెప్పువారు మనమధ్య అనేకులుండుట వలన ఈ యంశముపై సత్యమును తెలుసుకొను నిమిత్తము అపొస్తలులు ఏమి బోధించిరో గమనించుట అత్యవుసరము.

క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి మన మెప్పుడు చెప్పుకొనినను ఆయన మొదట ఒకసారి వచ్చెనను సత్యము అందులో ఇమిడియున్నది. "కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను". అని గలతీ 4:4లో వ్రాయబడియున్నది. యేసుక్రీస్తు ఒకసారి ఈ లోకమునకు వచ్చుట మాత్రమే గాక ఆయన మరల వత్తునని అనేకసార్లు బోధించెను. "నాయందు విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును. మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసుకొని పోవుదును" అని ఆయన బోధించెను (యోహాను 14:1-3).

క్రీస్తు మరల వచ్చునని గత 20వ శతాబ్దములలో యున్న క్రైస్తవులందరు ఎదురు చూచుచునే యున్నారు. అయితే ఆయన ఎప్పుడు రాబోవుచున్నాడు? ఆయన రాకడ ఎప్పుడో మనము ఏమైనను తెలిసికొనగలమా? ఆయన రాకడ

ఎప్పుడో నిజానికి యేమానవుడును ఎరుగడు. అది దేవునికి ఒక్కనికి మాత్రమే తెలియును. అందుకే "ఆ దినమును గూర్చియు ఆగడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు. జాగ్రత్తపడుడి, మెలకువగా నుండి ప్రార్థన చేయుడి, ఆ కాలమెప్పుడు వచ్చునో మీకు తెలియదు" అని యేసు బోధించెను (మార్కు 13:32, 33).

అయితే క్రీస్తు మరల రాకముందు కొన్ని సంగతులు జరుగవలసియున్నవి. యూదులు, అన్యులు కూడ క్రీస్తు సంఘములో చేర్చబడుట జరుగవలసి యున్నది. అన్యులు కూడ సంఘములో చేర్చబడుటను గూర్చి ఆయన "ఈ దొడ్డివి కాని వేరే గొర్రెలు నాకు కలవు. వాటిని కూడ నేను తోడుకొని రావలెను, అవి నా స్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొర్రెల కాపరి ఒక్కడును అగును" అని చెప్పెను (యోహాను 10:16). ఈ సంగతి మొదటి శతాబ్దములోనే నెరవేరెనను సంగతి మనమందరము ఎరిగినదే. క్రీస్తు మరల రాకముందు ఆయనను గూర్చిన సువార్త ఈ లోకమందంతట చాటించబడవలసి యున్నది, "మరియు ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును, అటు తరువాత అంతము వచ్చును" అని యేసు పలికెను. (మత్తయి 24:14). ఈనాడు క్రీస్తు సువార్త మరెన్నడు లేనంత ఎక్కువగా చాటించబడుచున్నది. సువార్త పత్రికల ద్వారా, ముద్రింపబడిన పుస్తకముల ద్వారా, బహిరంగ సభల ద్వారా, రేడియో, టెలివిజనుల ద్వారా ఈనాడు భూనలుమూలలా క్రీస్తును గూర్చి చాటించబడుచున్నది. అంటే క్రీస్తు యొక్క రెండవ రాకడ అతిసమీపముగ నున్నది యని మనము గ్రహించుకొనగలము.

క్రీస్తు రాకముందు జరుగవలసిన మరొకసంగతి యేమంటే - సంఘము విశ్వాస భ్రష్టత్వములో పడి, నాశన పాత్రుడగు పాపపు పురుషుడు బయలు పరచబడవలసి యున్నది. ఇందు విషయమై అపో. పౌలు ఇట్లు వ్రాసెను. "సహోదరులారా, ప్రభువు దినమిప్పుడే వచ్చియున్నట్టుగా ఆత్మవల్లనైనను, మాటవల్లనైనను మాయొద్ద

నుండి వచ్చినదని చెప్పిన పత్రిక వల్లనైనను ఎవడైనను చెప్పినయెడల, మీరు త్వరపడి చంచల మనస్కులు కాకుండ వలెననియు బెదరకుండ వలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడను బట్టియు మనము ఆయన యొద్ద కూడుకొనుటను బట్టియు మిమ్మును వేడుకొనుచున్నాము. మొదట భ్రష్టత్వము సంభవించి నాశన పాత్రుడగు పాప పురుషుడు బయలు పడితేనేగాని ఆ దినము రాదు. ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో దానినంతటిని ఎదిరించుచు దానికంతటికి పైగా వాడు తన్ను తానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఎవడును మిమ్మును మోసపరచనియ్యకుడి" (2 థెస్స 2:1-4). పరిశుద్ధాత్ముడు చెప్పిన ఈ సంగతి కూడ నెరవేరియున్నది. క్రీస్తు సంఘము 6వ శతాబ్దము నాటికి సంపూర్ణముగ విశ్వాస భ్రష్టురాలాయెను. క్రీ॥శ॥ 606లో మొట్టమొదటి పోపుగా Boniface III అను నతడు బయల్వెడలెను. ఇతడు భూమిపై క్రీస్తు యొక్క ఏకైక ప్రతినిధియనియు (Vicar of Christ), పరిశుద్ధ తండ్రియనియు (Holy Father), సార్వజనిక సంఘ శిరస్సనియు బిరుదులను ధరించెను. నాటినుండి నేటివరకు ఈ పోపుల సాంప్రదాయము మనమధ్య ఉండేయున్నది. అయితే క్రీస్తు ఏ మానవుని భూమిపై తన ప్రతినిధిగా ఏర్పరచుకొనలేదనియు, దేవుడొక్కడే మన పరిశుద్ధ తండ్రియనియు, సంఘమునకు శిరస్సు క్రీస్తే అనియు బైబిలు విశదముగ బోధించుచున్నందున నాశనపాత్రుడగు పాపపు పురుషుడెవడో మనము ఇట్టే గమనించుకొనగలము గదా?

క్రీస్తు ఇప్పుడు మరెల్లప్పుడు కూడ సర్వాధికారాన్ని కలిగి యున్నాడు. ఆ యధికారమును ఆయన మృతతుల్యులైన మానవులతో పంచుకొనుట లేదు. "పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికార మీయబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి ... ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని" యేసు చెప్పెను. (మత్తయి 28:18 - 20). యుగ సమాప్తి వరకు, సదాకాలము సర్వాధికారాన్ని యేసే కలిగి ఆయన

మనతో ఉన్నయెడల ఆయన ప్రతినిధి యొక్క అవుసరమే మనకు లేదని గ్రహించుదాము.

మరల ఆత్మీయ విషయాల్లో మనకు దేవుడు తప్ప తండ్రియైనవాడు ఏ మానవుడును లేడని యేసు బోధించెను. "మరియు భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు, ఒక్కడే మీ తండ్రి, ఆయన పరలోకమందున్నాడు" అని ఆయన బోధించెను (మత్త 23:9). ఈ రోజుల్లో క్రైస్తవ మతగురువులను Father అని పిలిచే అలవాటు, అట్లు పిలిపించుకొనే అలవాటు అనేకులు కలిగియున్నారు. అట్టివారు దేవునినే యెదిరించువారై యుండి నాశనపాత్రుడగు పాపపు పురుషుని ఆత్మను కలిగియున్నారని గమనించుదము.

క్రీస్తు యొక్క సంఘమునకు భూలోకములో శిరస్సుగా ఏ మానవుడును లేడని క్రొ.ని. బోధించుచున్నది. "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు, ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు, సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు, ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగునిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను" అని కొలస్స 1:18 ప్రకటించుచున్నది. క్రీస్తుకు రెండు శరీరములు ఎట్లులేవో అట్లే ఆయన సంఘమునకు రెండు శిరస్సులు లేవు. సంఘమునకు శిరస్సుగా ఏ మానవుడయినను తన్ను తాను నియమించుకొనిన యెడల అతడు దేవుని ఆలయములో దేవుని స్థానమునే ఆక్రమించుకొనిన ధర్మ విరోధియని మనము గ్రహించుదము.

యేసు క్రీస్తు మరల రాకముందు ఇట్టి సంగతులు జరుగునని పరిశుద్ధాత్ముడు ముందుగనే మనలను హెచ్చరించెను. గనుక నిజక్రైస్తవులు మరింత జాగరూకత కలిగియుండవలెను. "కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును, దయ్యముల బోధయందును లక్ష్యముంచి, విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు" (1 తిమో 4:1). నేటి క్రైస్తవ లోకమును ఒక్కసారి పరిశీలించిన యెడల ఈమాట సత్యమని మనము ఒప్పుకొనక తప్పదు.

అందువలన క్రీస్తు యొక్క రెండవ రాకడ కొరకు ఈలోకము పరిపక్వమై యున్నదని గమనించుదము. ఆయన రాకడకు ముందు జరుగవలసిన సంగతులన్నియు జరిగియున్నవని మనము గమనించాము. గనుక ఆయన రాకడ ఎప్పుడైనను సంభవించునని యెరిగి అతి జాగరూకతతో మనముండవలెను.

ఆయన రాకడు దొంగవచ్చిన యట్లుండును : "ఏ జామున దొంగ వచ్చునో యింటి యజమానికి తెలిసియుండిన యెడల అతడు మెలకువగా ఉండి తనయింటికి కన్నము వేయనియ్యడని మీరెరుగుదురు. మీరనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును గనుకనే మీరును సిద్ధముగా యుండుడి" అని యేసు బోధించెను. ఆయన అకస్మాత్తుగా వచ్చును, మనమనుకొనని సమయమందు ఆయన వచ్చును. ఆయన వచ్చుట తథ్యము. నీవు సిద్ధముగా యున్నావా? లేనియెడల ఈనాడే క్రీస్తును ధరించుకొని ఆయన రాకకై ఎదురుచూడుము. క్రీస్తు నందు విశ్వాసముంచుము, పాపముల విషయమై మారు మనస్సు నొందుము, పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. ఆయన రాకకై మిగిలిన క్రైస్తవులతో కలసి ఆశతో అపేక్షించుము.

వచ్చే సంచికలో క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి మరికొన్ని సత్యములను దైవ వేదము నుండి తెలిసికొందము.

**- జాషువా గూటం**

000

## "వరాల సిరులు"

మనస్సులోని గాయాలను చూచి
ఓ మనిషీ! కలత పడకు

హృదయాన్ని చీల్చి ఊటకి వచ్చే ...
నీ కన్నీరు పన్నీరు కాకతప్పదు!

పండుటాకులు రాల్చాకనే చెట్టు చిగురేస్తుంది
ప్రసవవేదనతోనే పడతి శిశువును కంటుంది

ప్రకృతి మనకు నేర్పు పాఠం ఇది! అయితే;
ప్రభువునొద్ద మనం నేర్వాల్సింది ఎంతో ఉంది!

సిలువ మ్రాను భారమని, ఆ మరణం మహా ఘోరమని -
ఆనాడు యేసు తలంచివుంటే, పాపికి క్షమాపణ ఉండేదా?
విశ్వాసికి విముక్తి లభించేదా?

క్రీస్తుయొక్క సిలువ శ్రమలే ... ఆయన భక్తులకు
వరాలసిరులు - పరలోక భాగ్యాలు అయ్యాయి!

భంగపడిన బాటసారి ... బెంగపడకు
అయినవారే నిన్ను కాదన్నప్పుడు ...

నీ ఇంటివారే నిన్ను గెంటివేసినప్పుడు
గుండె గాయాల లోతుల నుండి క్రొత్తగేయం పుట్టుకొస్తుంది.

కాసింత కష్టం రాపిడికి కదలిపోయి
కరగిపోయి విరిగిపోయి కృంగిపోకు

నీ గాయంకు స్వస్థత ! నీ వేదనక్కు ఆనందం
కలిగించేందుకే క్రీస్తు మృతిపొంది సమాధికి వెళ్లాడు

చావునకు లోనైన నిన్నూ ! నన్నూ ! బ్రతికించేందుకు
పునరుత్థానుడై పరలోకం తెరిచాడు ...

ఈ ప్రభువును నీ ప్రభువునుగా అంగీకరించు
బాప్తిస్మం పొందు ! అప్పుడు పరలోకం నీదే అవుతుంది !

- సామ్యూల్ జాన్స్ మేడిది
కొటితివాడ

# మరణమైన తరువాత - ఏమిటి ?
## After Death ^ What Then
(గత సంచిక తరువాయి)

### 3. మృతులు స్మృతి కలిగినవారా ?

మరణించిన తరువాత పునరుత్థానమునకు ముందు ఆత్మయొక్క పరిస్థితి యేమిటి? వెడలిపోయిన ఆత్మ స్మృతి కలిగినదా? కాదా? అని అనేకులు అడుగుదురు. ఈ ప్రశ్నలను పరిశుద్ధ లేఖనములు జవాబిచ్చుట మాత్రమే గాకుండా, ఖచ్చితమైన సమాచారమును మనకియ్యగలవు.

ధనవంతుడు, లాజరును గూర్చి ప్రభువు చెప్పినది భౌతిక మరణమునకును పునరుత్థానమునకును మధ్య ఆత్మ స్మృతి కలిగియుండునని బోధించుచున్నది (లూకా

16:19-31). భూమిపై జీవించిన జీవితమును బట్టి శరీరము మరణించిన తరువాత ఆత్మ ఆనందముతో గాని లేక వేదనతోగాని జీవించును. ధనవంతుడు చనిపోయెను. వెంటనే అతడు మహాయాతనలో ఉండెను. అతడు తన వేధనను ఎరిగినవాడు మాత్రమే గాక భూమిపై ఇంకను జీవించుచున్న తన అయిదుగురు సహోదరులను జ్ఞాపకము చేసికొనెను. వారు అతడున్న చోటికి రాకుంటే మంచిదని కోరెను. అతడు భూమిపై తన గత జీవితమును జ్ఞాపకము చేసికొనిన యెడల అతడిప్పుడు ఎందుకు యాతన పడుచున్నాడో అర్థమగునని తండ్రియైన అబ్రహాము అతనికి చెప్పెను. ఈలోగా లాజరు కూడా చనిపోయెను. గాని అతడు వెంటనే ఆనందముతో యుండి నెమ్మది పొందుచుండెను. గనుక ఈ ధనవంతుడును, లాజరును చైతన్యము కలిగిన స్థితిలో యుండిరి. భూమిమీద వారి జీవితమును ఇంకను జ్ఞాపకముంచకొన గల్గిరి.

యేసు బహు తేటగా చెప్పిన ఈ సంఘటనను ఒక ఉపమానముగా భావించి దానిని శక్తిహీనముగా చేయుటకు కొందరు ప్రయత్నింతురు. అయితే ఉపమానమేమి, చరిత్ర యేమి లేక ఈ రెండునేమి, లేఖనములు సత్యమునే బోధించును గాని అసత్యమును కాదు. అదొక ఉపమానమని చెప్పుటలో ఈ ఇద్దరి మనుష్యులను గూర్చిన సత్యము మార్చబడదు. కట్టుకథలవలె గాక క్రీస్తు యొక్క ఉపమానములు వాస్తవములు. యేసు ఇక్కడ వర్ణించిన జీవితానంతర పరిస్థితులు యథార్థమైనవి; ఆయన వాటియొక్క వాస్తవిక స్థితిని వర్ణించెను. "ధనవంతుడొకడుండెను" అని యేసు చెప్పెను. అతడెక్కడ ఉండెను? మరల "లాజరు అను దరిద్రుడుండెను" అని ఆయన చెప్పెను. అతడుండెనా? ధనవంతుడు చనిపోయెనా? లాజరు చనిపోయెనా? వారు చనిపోయిరా? వారు చనిపోయిరని యేసు చెప్పెను. ఆత్మీయ సత్యమును బోధించుటకు క్రీస్తు చారిత్రక వాస్తవములను పలుమారులు ఉపయోగించెను. ఈ సంఘటన ఒక కట్టుకథయని తలంచుట ఎంత బుద్ధిహీనతయో?

ఈ వర్ణనలోని సంఘటనలు వాస్తవములైనను మానవునికి గ్రహింపగు నిమిత్తము ప్రభువు కొంత అలంకార భాష నుపయోగించెను. ఆత్మీయ జీవులను వర్ణించుటకు క్రీస్తు మానవుని అనుభూతిని బట్టి మాటలాడవలసి వచ్చెను. ఆత్మీయ స్థితిలో నిజముగా అగ్నిగాని, నీరుగాని గొప్ప అగాధము గాని యుండక పోవచ్చును: అయితే వీటివలన కొంత యధార్థత, ఖచ్చితములు సూచింపబడెను. అశరీరులుగా యున్న ఈ రెండు ఆత్మల సంతోష యాతనల స్మృతి యధార్థముగాని అవి అలంకార రీతిగా వర్ణించబడెను.

ధనవంతుడు, లాజరును గూర్చిన ఈ వర్ణన నుండి రెండు గొప్ప వాస్తవములను మనము నేర్చుకొన వచ్చును: 1. మరణమనగా ఇక లేకపోవుట (extinction) కాదు; శరీరము క్షీణించిపోయినను ఆత్మ జీవించును మరియు శరీరము తిరిగి మన్నైపోయిన తరువాత అది జీవించును. 2. అశరీరులుగా యున్న ఆత్మలు స్మృతి కలిగిన స్థితిలో యుండును. సంతోషముగా గాని లేక దుఃఖముతో గాని, వారు శరీరములో యుండి జీవించిన దానిని బట్టి అవి యుండును. వారియొక్క ఉనికిని వారెరిగినవారై యుందురు. వారియొక్క ఉనికిని వారెరిగినవారై యుండి భూసంబంధ జీవితమును గూర్చి జ్ఞప్తి కలిగినవారై యుందురు. గనుక శరీరము క్షీణించిన తరువాత మానవుని ఆత్మ స్మృతి కలిగి ప్రత్యేకముగా జీవించ గలదని బైబిలు బోధించుచున్నది.

మరణము నష్టము కాదు గాని లాభమే యని పౌలు తలంచెను; అది క్రీస్తుతో కూడ నుండుటకు వెడలిపోవుట, మరియు అది మేలు (ఫిలిప్పీ 1:23). సంతోష దుఃఖములతో మిళితమై ప్రభువును సేవించుటకంటే చనిపోయి సంపూర్తి స్మృతిని కోల్పోవుట శ్రేష్టమని పౌలు చెప్పుచున్నట్లు ఎవరు ఊహించలేరు! ఈ లోకములో జీవించుటకంటే చనిపోయిన తరువాత నున్న పరిస్థితి మరి మేలైనది ఎట్లు కాగలదు? నిజముగా క్రైస్తవునికి చావైతే లాభము (21వ).

పౌలు 2 కొరింథీ 12:2-4లో వర్ణించిన తన అనుభవము, అనగా 3వ ఆకాశమునకు, పరదైసులోనికి కొని పోబడుట, శరీరమునకు వెలుపల స్మృతి గల

ఉనికిని బోధించుచున్నది. ఆ సమయమందు పౌలు శరీరముతో యుండెనో లేక శరీరము లేకయుండెనో నిజానికి అతడెరుగడు. శరీరము లేక యుండినయెడల అతడు స్మృతి కలిగియే యుండెను. ఈ సందర్భములో ఏమైతే సత్యమో అదే శరీరము నుండి ఆత్మవేరైన ప్రతి సందర్భములోను సత్యము. శరీరము నుండి వెడలిపోయిన తరువాత ఆత్మ స్మృతి కలిగి జీవించుచునే యుండును.

ఆదిమ హతసాక్షుల యొక్క ఆత్మలు శరీరము లేని స్థితిలో జీవించుచు స్మృతి కలిగి తీర్పుదినము కొరకు కనిపెట్టుచున్నట్లు చెప్పబడెను (ప్రక 6:9-11). మృతి నొందిన నీతిమంతులు ధన్యులు లేక సంతోషముగా యున్నవారు : "ప్రభువు నందు మృతినొందు మృతులు ధన్యులు ... వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు; వారి క్రియలు వారివెంట పోవును" (ప్రకటన 14:13). సంపూర్తిగా స్మృతిని కోల్పోయినవాడు సంతోషముగా యుండడు; అయినను ప్రభువు నందు మృతి నొందువారు ధన్యులని బైబిలు చెప్పుచున్నది. వారు సంతోషముగా ఉండబోవుదురు అని అది చెప్పుటలేదు కాని వారిప్పుడు సంతోషముగా యున్నారని అది చెప్పుచున్నది.

మృతులైనవారు స్మృతి లేకుండా యుందురని చెప్పుటకు కొందరు తరచు ప్రసంగి 9:5ను వినియోగింతురు. "చచ్చిన వారు ఏమియు ఎరుగరు" అని అది చెప్పుచున్నది. అయితే తరువాత వచనము 'సూర్యుని క్రింద జరుగువాటిని' గూర్చి చెప్పుచున్నది, అంటే వారొకానొకప్పుడు జీవించిన ఈ లోకములో అని దాని యర్థము. మరణించిన తరువాత భూమిపై మానవుని సంచలనము ఆగిపోవును; అతడు చనిపోయిన తరువాత భూమిమీద ఏమి జరుగుచున్నదో అతడేమియు ఎరుగడు. మరణించిన తరువాత ఆత్మ ఏమియు ఎరుగదని లేఖనములలో ఎక్కడ సూచింపబడలేదు.

కొందరు 'ఆత్మ నిద్రించుటను' నమ్ముదురు; అంటే మరణమైన తరువాత ఆత్మ స్పృహ కోల్పోయిన స్థితిలో యుండునని వారి భావము. చావును నిద్రగా

వర్ణించు లేఖనములను దీనిని నమ్ము వారుపయోగించి మరణమునకు పునరుత్థానమునకు మధ్య ఆత్మ స్పృహ లేనిదై యుండునని వారు బోధింతురు (ఉదా : మార్కు 5:39: యోహాను 11:11; అపొ.కా. 7:60; 1 థెస్స 4:31-15). అయితే నిద్ర అనుమాట భౌతిక మరణమును గూర్చి ఉపయోగింప బడినప్పుడు ఎల్లప్పుడు అది శరీరములకే గాని ఆత్మలకు వర్తించదు. శరీరములు సమాధులలో నిద్రించును (దాని 12:2; మత్తయి 27:52, 53). గనుక చనిపోయిన వారిని పాతిపెట్టే సమాధుల దొడ్డి నిజానికి మృతదేహములు పునరుత్థానమునకు కనిపెట్టు నిద్రించు స్థలము. ఆత్మలు సమాధులలో లేవు. అవి ఎక్కడ నిద్రించుటలేదు గాని అవి చైతన్యము కలిగియున్నవి. ఏలయనగా జీవించు చున్నను మరణించినను 'అందరు జీవింతురు' (లూకా 20:38). గనుక మరణమును వర్ణించుటకు నిద్రించుట అలంకారరీతిగా ఉపయోగింపబడెను; ఏలయనగా నిద్రించుచున్న శరీరమునకు మరణించిన శరీరమునకు పోలికలున్నవి. చనిపోయిన మనుష్యులు నిద్రించుచున్నట్లు అగుపడును. మరణములో శరీరము నిద్రించును గాని ఆత్మ నిద్రించదు. నిద్రించిన మానవుడు ఉదయాన్నే తన పనులనెట్లు చక్కబెట్టుటకు లేచునో అట్టే సమాధులలో నిద్రించు శరీరములు ఒక క్రొత్త జీవితము కొరకు లేపబడును.

ఆత్మలు నిద్రించు భావము బైబిలులో బోధింపబడలేదు. మరణమునకు పునరుత్థానమునకు మధ్యగల దీర్ఘకాలములో ఆత్మలు స్మృతి తప్పిన స్థితిలో కాలము గడుపవు. బైబిలులో మరణము అనగా ఆత్మ 'సంపూర్తిగ లేకపోవుట' గాని లేక స్మృతి లేకపోవుట గాని కాదు. వెడలిపోయిన ఆత్మలు జీవించుచున్నవి, స్మృతి కలిగినవి.

## 4. మృతులు ఎక్కడ ఉన్నారు?

మరణములో ఆత్మ శరీరమును విడనాడి ప్రత్యేకముగా స్మృతి కలిగి జీవించును. గాని ఎక్కడ? ఆత్మ సమాధిలో శరీరమువలె నిద్రించదు, సరిగదా

అది సమాధి చుట్టూ ఆవరించుకొనియుండదు. లేక మరికొన్ని మతస్థులు ఊహించుచున్నట్లు అది వేరొక శరీరములో ప్రవేశించదు. ఆత్మలు ఒక శరీరము నుండి వేరొక దానిలోకి వెళ్లుట లేక తిరిగి జన్మించుట అను భావములు బైబిలు బోధకు కేవలము ప్రతికూలముగా యున్నవి. మరణించిన తరువాత ఆత్మ దానిని దయచేసిన దేవుని యొద్దకు పోవునని బైబిలు చెప్పుచున్నది (ప్రసంగి 12:7).

అయితే మరణించిన తరువాత పునరుత్థానము కొరకు కనిపెట్టుటకు ఆత్మలు ఎక్కడికి పోవును? తీర్పు తరువాత చివరి గమ్యమగు పరలోకము లేక నరకములోనికి అవి పోవునా? లేక ఒక మధ్యస్థ నివాసములోనికి పోవునా? ప్రభువు మరల వచ్చునప్పుడు తీర్పు దినమందు, క్రీస్తు విమోచింపబడినవారితో, "నా తండ్రిచేత ఆశీర్వదింపబడిన వారలారా రండి; లోకము పుట్టినది మొదలుకొని మీకొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించు కొనుడి" యని చెప్పను. దుర్మార్గులతో ఆయన "శపింపబడిన వారలారా, నిత్యాగ్నిలోనికి పోవుడి. వీరు నిత్యశిక్షకును, నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు" (మత్తయి 25:31-46). ఆ దినమందు క్రీస్తు అనుచరులు నీతి కిరీటమును పొందుదురు (2 తిమో 4:8: 1 పేతురు 5:4; లూకా 14:14). క్రీస్తు ఇట్లనెను : "మీ హృదయములను కలవరపడనియ్యకుడి; దేవుని యందు విశ్వాస ముంచుచున్నారు. నా యందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల• మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసుకొనిపోవుదును" (యోహాను 14:1-3). పాత నిబంధన కాలములో జీవించిన పరిశుద్ధులు కూడ నిత్యనీతి నివాసములోనికి ప్రవేశించుటకు కనిపెట్టుచున్నారు. పెంతెకొస్తునాడు పేతురు దావీదును గూర్చి చెబుతూ, "దావీదు, పరలోకమునకు ఎక్కిపోలేదు" అని ప్రకటించెను (అపొ.కా. 2:34). గనుక చనిపోయిన వెంటనే ఆత్మలు నిత్యస్థితిలోనికి అనగా పరలోకములో

గాని నరకములో గాని ప్రవేశింపవు.

అశరీరులుగా యున్న ఆత్మ లన్నియు మరణ పునరుత్థానముల మధ్య జీవించుటకు ప్రభువు ఒక మధ్యస్థ స్థలమును సిద్ధపరచెను. అది పాతాళ లోకము లేక మృతుల లోకము అని (Hades) పిలువబడెను. క్రొత్త నిబంధనలోని రెండు వచనములు ఈ సత్యమును తెలియజేయుచున్నవి : 1) లూకా 16:23. మరణించిన తరువాత ధనవంతుని యొక్కయు లాజరు యొక్కయు ఆత్మలు పాతాళములో (Hades) యుండెను. ధనవంతుడు పాతాళము నుండి కన్నులెత్తి చూచినట్లు యేసు చెప్పెను. 2) అపొ.కా. 2:27, 31. యేసు చనిపోయినప్పుడు ఆయన ఆత్మ పాతాళమునకు కొనిపోబడెను. పెంతెకోస్తునాడు పేతురు దావీదు చేసిన "నీవు నా (క్రీస్తు యొక్క) ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు" అను ప్రవచనమును చెప్పెను. మరల "క్రీస్తు పాతాళములో విడువబడలేదని" అతడు చెప్పెను. మనుష్యుడు చనిపోయినప్పుడు ఆత్మ పాతాళమునకు, శరీరము సమాధిలోనికి కొనిపోబడును. పాతాళము (Hades) రెండు భాగములుగా విభజింపబడియున్నది. నీతిమంతుల నివాసమగు పరదైసు. మరియు దుర్మార్గుల నివాసమగు చీకటి బిలము (Tartarus) పునరుత్థానము నందు నీతిమంతుల ఆత్మలు పరదైసును, దుర్మార్గుల ఆత్మలు చీకటి బిలమును విడుచును. అప్పుడు తీర్పు జరిగిన తరువాత నీతిమంతులు పరలోకము లోను దుర్మార్గులు నరకములోను నిత్యము నివసింతురు.

పాతాళము అనగా వాటి నైతికతత్వ మెట్లున్నను ఆత్మలు వెళ్లు ప్రదేశమని అర్థము. పాతాళము (Hades) అనగా అదృశ్యలోకమని దానియొక్క ప్రాముఖ్యార్థము. వెడలిపోయిన ఆత్మలుండు ప్రదేశము భూమిమీదనుండు ప్రజలకు అగోచరమైనను అది దేవునికి అగోచరము కాదు. క్రొత్త నిబంధనలో పాతాళము (Hades) అనునది ఎల్లప్పుడు అశరీరులుగా యున్న ఆత్మల ప్రదేశమును సూచించుచున్నది. సమాధి కేవలము శరీరమును స్వీకరించు స్థలము మాత్రమే. Hades అనగా అశరీరులైన ఆత్మల యొక్క సాధారణ స్థలము అని Thayer నిర్వచించెను. గ్రీకుభాషలో Hades

లేక పాతాళము అను పదము ఈ దిగువ క్రొత్త నిబంధన వచనములలో కనబడును : మత్తయి 11:23; 16:18; లూకా 10:15; 16:23, అపో.కా. 2:27, 31; ప్రకటన 1:18, 6:8: 20:13, 14.

దుష్టులయొక్క ఆఖరి నివాసము నరకము. అదియే నరకాగ్ని యని కూడ చెప్పబడినది. నరకము లేక నరకాగ్ని యను పదములు క్రొత్త నిబంధనలో ఈ దిగువ వచనములలో కనబడుచున్నవి : మత్తయి 5:22, 29, 30; 10:28; 18:9; 23:15, 33; మార్కు 9:43, 45, 47; లూకా 12:5; యాకోబు 3:6. గనుక ధనవంతుడు నరకములో నుండి కనులెత్తి చూచెనని యేసుగాని లేక యేసుయొక్క ఆత్మ నరకములో ఉండిపోయెనని పేతురుగాని చెప్పలేదు. గాని ఆయన శరీరము సమాధిలో యుండగా ఆయన ఆత్మ పాతాళములో (Hades) యుండెను. అట్లే ధనవంతుడు, లాజరు కూడ తమ కడవరి స్థితిలో అనగా నరకములోగాని లేక పరలోకములోగాని లేరు. వారి సంఘటన తీర్పు జరుగక ముందున్న స్థితిని వర్ణించెను. ఏలయనగా ఆ ధనవంతునికి భూమిమీద ఇంకా అయిదుగురు సహోదరులుండిరి, మృతుల పునరుత్థానము, తీర్పు ఇంకా జరుగలేదు; అది కాలాంత మయ్యేవరకు జరుగదు.

Tartarus అనగా కటిక చీకటి గల బిలము అనుపదము గ్రీకు నిబంధనలో ఒక్కమారే అగుపడును: 'దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక, పాతాళలోకమందలి కటికచీకటి గల బిలములోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను" (2 పేతురు 2:4). పాపములో పడిన దూతలను గూర్చి ఇక్కడ చెప్పబడినది. యూదా 6వ వచనములో కూడ ఇదే సంగతి చెప్పబడినది. గనుక దుష్టులయొక్క ఆత్మలు మరణ పునరుత్థానముల మధ్యకాలములో ఆఖరి తీర్పు కొరకు కనిపెట్టుచుయుండు ప్రదేశము పాతాళ లోకములో గల కటిక చీకటిగల బిలము.

పరదైసు అనుపదము పాతాళములో నీతిమంతుల ఆత్మలుండు ప్రదేశమును సూచించుచున్నది. నేడు నీవు నాతో కూడ పరదైసులో యుందువని క్రీస్తు సిలువపై నున్న దొంగతో చెప్పినదానిని, ఆయన పాతాళములో విడువబడలేదని పేతురు క్రీస్తును గూర్చి చెప్పిన దానితో పోల్చిచూచిన, పరదైసు పాతాళములో ఒక భాగమని గ్రహించుకొనగలము. క్రీస్తు పాతాళమునకు వెళ్ళెను. క్రీస్తు పరదైసునకు కూడ వెళ్ళెను. గనుక పాతాళములో పరదైసు ఉన్నది. అందువలన పాతాళములో రెండు భాగములున్నవని బైబిలు బోధించుచున్నది: అవి పరదైసు, చీకటి బిలము అనునవి. మరణించిన తరువాత మంచివారు, చెడ్డవారు పాతాళమునకు వెళ్ళినను, అక్కడ వారి పరిస్థితి సమానముగ యుండదు; కొందరు సంతోష స్థితిలోను మరికొందరు వేదన గల స్థితిలోను యుందురు.

తీర్పు జరిగిన తరువాత అమర్త్యమైన శరీరములతో విమోచింపబడిన వారుండు నిత్య నివాసమును పరదైసు అనుపదము సూచించుచున్నది (ప్రకటన 2:7; 2 కొరింధీ 12:4). పరదైసు అనుపదమునకు ఆనందవనము, సంతోషస్థానము అని యర్థము. లేఖనములలో ఆ పదము ఈ దిగువ భావములతో వినియోగింపబడెను : 1. ఏదేను వనము 2. నీతిమంతుల ఆత్మలు విశ్రాంతి గైకొను ప్రదేశము 3. పరలోకము (ప్రకటన 22:1-5).

వినోదము కొరకు సిద్ధపరచబడిన ఏదైనా ఒక స్థలము పరదైసు. అది సంతోష స్థితిని కూడ సూచించును. గనుక మానవుని ఆదిమ గృహమును వర్ణించుటకు లేక మరణమైన తరువాత నీతిమంతుల ఆత్మలు పునరుత్థానము కొరకు కనిపెట్టుస్థలమును వర్ణించుటకు లేక తీర్పు తరువాత వారి ఆఖరి నివాసమును, అనగా పరలోకమును వర్ణించుటకు 'పరదైసు' అను పదము వినియోగింపబడ వచ్చును. (సశేషం)

- పెద్రికోతమ్

వాక్యపరిచర్యలో పాల్గొనిరి. సోదరులు కుసుమ ఐజక్‌గారు ముగింపు ప్రార్థన చేసిరి. స్థానిక సంఘము మంచి భోజనపానాదులు ఏర్పాటుచేసిరి. యెంట్రుకోనలో సి.హెచ్.యేసుదాసుగారు చాలకాలము నుండి వాక్యపరిచర్య చేయుచున్నారు.

మార్చి 24వ తేదీ సాయంకాలము కృష్ణాజిల్లా నందిగామలో సోదరులు తోటా వెంకటేశ్వరరావ్ గారి యింటివద్ద ఏర్పాటుచేయబడిన కృతజ్ఞత కూటములో సోదరులు జాషువా గారు సతీసమేతముగా పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. తోట వెంకటేశ్వరరావ్ గారు క్రీస్తులోనికి తిరిగి జన్మించిన 6వ వార్షిక సందర్భముగా ఆ కృతజ్ఞత కూటము నేర్పాటుచేసిరి. కూటం అనంతరం స్థానిక సంఘములో అక్కరగలవారికి వెంకటేశ్వరరావ్ దంపతులు వస్త్రదానము చేసిరి. వచ్చిన వారందరికీ మంచి విందునిచ్చిరి.

మార్చి 25వ తేదీ ఆదివారం ఉదయం విజయవాడ ముత్యాలమ్మపాడులోని సంఘము 7వ వార్షికోత్సవము జరుపుకొనగా జాషువాగూటం గారు వారిమధ్య వాక్య పరిచర్య చేసిరి. సంఘము సంఖ్యలోను, ఆత్మీయముగాను అభివద్ధి జెందుచున్నందుకు వారిని, స్థానిక సువార్తికులు పి.అబ్రాహాము గారిని అభినందించిరి. నందిగామ సువార్తికులు జి.మార్కుగారు కూడా వాక్యమును బట్టి తగు హెచ్చరికల నిచ్చిరి.

మార్చి 26వ తేదీ సోమవారం ఖమ్మం జిల్లా మణుగూరు ప్రాంతములో సోదరులు జాషువాగారు సువార్త పరిచర్య చేసిరి. సోమవారం ఉదయం జరిగిన సభలో వాక్యపరిచర్య చేయగా ఇద్దరు యౌవనులు (కోయజాతివారు) క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సోమవారం సాయంకాలం బండారుగూడెంలో ఏడుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఆ రాత్రివేళ బండారు గూడెంలో జరిగిన సభలో జాషువా గారు వాక్యపరిచర్య చేసిరి. క్రైస్తవ సహవాసములోను, ప్రేమలోను మంచి మాదిరిని వెలకొల్పుచున్న బండారుగూడెం సంఘమును అభినందించిరి. మణుగూరు, బండారు గూడెం ప్రాంతములోను, చుట్టుపట్లనున్న అనేక గిరిజన ప్రాంతములలోను సోదరులు పి.సురేంద్రకుమార్‌గారు గొప్ప పనిని క్రీస్తు కొరకు చేయుచున్నారు.

మార్చి 30వ తేదీ శుక్రవారం బిక్కవోలు బైబిలు స్కూల్ ఆధ్వర్యమున పశ్చిమగోదావరి జిల్లా గంటావారిగూడెంలో సువార్తికులు సదస్సు ఘనంగా జరిగెను. పలు ప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులు, స్థానిక సంఘస్థులతో అక్కడి క్రీస్తు సంఘ ఆలయము నిండెను. సోదరులు ఎ.వినయానంద్ (అనకాపల్లి), జాషువాగూటం గార్లు ముఖ్య అతిధులుగా సదస్సుకు ఆహ్వానించబడిరి. బిక్కవోలు బైబిలు స్కూల్ డైరక్టర్ యస్.జాన్ గారు ఆహ్వానితులను సభకు పరిచయము చేసిరి. ఉదయకాలం సోదరులు జి.విజయకుమార్, మధ్యాహ్నం సోదరులు పి.యస్.జైపాల్ (ర్యాలి) గార్లు సదస్సుకు అధ్యక్షతవహించి చక్కగా నడిపించిరి. సోదరులు పాల్ ప్రసన్నకుమార్, జాషువాగూటం, వినయానందగార్లు సంఘములో స్త్రీల యొక్క పాత్ర, సంఘ నిర్మాణ పద్ధతి, సంఘనాయకుల విధులు మొదలగు అంశములను గ్రంధము నుండి సవిస్తరముగా ఉపదేశించిరి. బైబిలు స్కూల్ విద్యార్థులు పాటలు పాడుటలోను, పరిచర్య చేయుటలోను సహకరించిరి. స్థానిక సంఘము వచ్చిన వారందరికీ మంచి భోజనము నేర్పాటుచేసిరి. సోదరులు యస్.జాన్‌గారు బోధకులకు సమయోచితమైన హెచ్చరికలనిచ్చి వందన సమర్పణ చేయగా జాషువా గారి ప్రార్థనతో సాయంకాలం సదస్సు ముగిసెను. గంటావారిగూడెంలో సువార్తికుల సహవాస సదస్సును జయప్రదంగా నిర్వహించినందుకు సోదరులు యస్.జాన్‌గారు, స్థానిక సువార్తికులు బి.యేసురత్నం, జె.బుల్లబ్బాయి గార్లు అభినందనీయులు.


RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/04/2001



From:
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001


To


Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004. Editor : Joshua Gootam